పాతబస్తీలో నేరాలకు అడ్డుకట్ట వేయాలి :రాజాసింగ్

హైదరాబాద్ సిటీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పాతబస్తీలో హత్యలు ఎక్కువగా జరుగుతున్నాయని, అక్కడ లా అండ్ ఆర్డర్ నిస్తేజంగా మారిపోయిందని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఆరోపించారు. రాత్రి పూట పోలీసులు పెట్రోలింగ్ చేస్తుంటే వారిపై మజ్లిస్ ఎమ్మెల్యేలు ఒత్తిడి తీసుకువస్తున్నారని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఎంఐఎం విషయంలో స్పందించడంలేదన్నారు. పాతబస్తీలో నేరాలకు అడ్డుకట్టు వేయడానికి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

విధ్వంసకర ప్రాజెక్టును ఉపసంహరించాలి

● ఫార్మాసిటీని రద్దు చేసి మెగాసిటీని తేవద్దు : ప్రొ. దేసర్డా



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్థికవేత్త ప్రొఫెసర్ హెచ్.ఎం దేసర్డా

పంజాగుట్ట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీని రద్దు చేసి దాని స్థానంలో విధ్వంసకర ప్రాజెక్టును తీసుకురావటం రాష్ట్ర ప్రభుత్వానికి తగదని, దానిని వెంటనే ఉపసంహరించుకోవాలని మహారాష్ట్ర రాష్ట్ర ప్రణాళిక సంఘం మాజీ సభ్యుడు, ఆర్థికవేత్త ప్రొఫెసర్ హెచ్.ఎం దేసర్డా డిమాండ్ చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో శాస్త్రవేత్త డాక్టర్ బాబు రావు, పర్యావరణవేత్త కవుల సరస్వతి, టి.శివప్రసాద్ రెడ్డిలతో కలిసి ఆయన మాట్లాడారు. తాను రంగారెడ్డి జిల్లా యాచారం మండలం ఫార్మాసిటీ బాధిత గ్రామాల్లో వ్యవసాయం చేస్తూ, అనేక రకాల పంటలు పండిస్తున్నారని, పశుసంపద కూడా చాలా ఉందని తెలిపారు. ప్రస్తుతం మెగాసిటీ అని భూమి తీసుకుంటే సమస్య మళ్లీ మొదటికి వస్తుందన్నారు. ప్రకృతి సిద్ధంగా జరుగుతున్న వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థని ప్రోత్సహించాలని అన్నారు.

వేతన బకాయిలు వెంటనే చెల్లించాలి



కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బస్తీ దవాఖానా వైద్యులు, సిబ్బంది

పంజాగుట్ట, జూన్27 (ఆంధ్రజ్యోతి): బస్తీ దవాఖానా వైద్యులు, సిబ్బందికి వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని కాంట్రాక్టు ఎంబీబీఎస్ డాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. మూడు నెలలుగా జీతాలు రాక నానా ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గురువారం వెంగళరావునగర్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్(ఐ.ఐ.హెచ్. ఎఫ్.డబ్ల్యూ) కార్యాలయంలో డీఎంహెచ్‌ఓలు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. విషయం తెలుసుకున్న బస్తీ దవాఖానా వైద్యులు, సిబ్బంది అక్కడికి చేరుకుని ఆందోళన నిర్వహించారు. లోపలికి వెళ్లడానికి ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు, వైద్యులు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి ప్రతి నెలా ఐదవ తేదీ లోపు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రతినిధుల బృందం మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి వినతిపత్రం అందించి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వాటిని పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

హర్షశ్రీకి ఏపీ లాసెట్‌లో 9వ ర్యాంకు



హైదరాబాద్ సిటీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఏపీలోని నంద్యాల ఎస్వీవోస్ కాలనీకి చెందిన తొమ్మండ్రు గురు హర్షశ్రీకి ఏపీ లాసెట్‌లో 9వ ర్యాంకు లభించింది. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ చదివిన ఆమె 991 మార్కులు సాధించి తెలంగాణలో మూడో ర్యాంకు సాధించారు. అయితే ఈ ఏడాది జరిగిన తెలంగాణ లాసెట్‌లో రాష్ట్రస్థాయిలో 71వ ర్యాంకు సాధించిన హర్షశ్రీ.. తాజాగా ఏపీ లాసెట్‌లో 9వ ర్యాంకు సాధించారు. లా పూర్తిచేసిన తర్వాత జ్యుడీషియల్ సర్వీస్‌లో చేరడమే తన లక్ష్యమని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు.

అరబిక్‌లో సయ్యిదా మర్యమ్ గజాలకు డాక్టరేట్

హైదరాబాద్ సిటీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మెహిదీపట్నంలోని సెయింట్ ఆన్స్ మహిళా డిగ్రీ కళాశాలలో అరబిక్ భాషా శాస్త్ర అధ్యాపకురాలిగా పనిచేస్తున్న సయ్యిదా మర్యమ్ గజాల ఉస్మానియా యూనివర్సిటీ నుంచి అరబిక్‌లో డాక్టరేట్ పొందారు. హైదరాబాద్‌లోని గ్రంథాలయాల్లో ఉన్న 'హదీసు చేతిరాత ప్రతుల విశ్లేషణ' అంశంపై పరిశోధన చేసిన సయ్యిదా మర్యమ్ గజాల సిద్ధాంత గ్రంథానికి డాక్టరేట్ ప్రకటించారు. కాగా, ఉస్మానియా అరబిక్ విభాగాధిపతిగా వ్యవహరిస్తున్న సీనియర్ ప్రొఫెసర్ సయ్యిదా తలత్ సుల్తానా ఆమెకు పర్యవేక్షకుడిగా వ్యవహరించారు.

సివిల్స్ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి




పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎన్వీఎస్ రెడ్డి

హైదరాబాద్ సిటీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించే సివిల్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి సూచించారు. ఈ మేరకు తన కార్యాలయంలో క్రిష్ణప్రదీప్ 21 సెంచరీ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ వాల్‌పోస్టర్‌ను గురువారం ఆయన ఆవిష్కరించారు. అకాడమీ చైర్మన్ క్రిష్ణప్రదీప్ మాట్లాడుతూ యూపీఎస్సీ-2025లో నిర్వహిస్తున్న సివిల్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఆప్షనల్ ఎంపికపై 7 రోజులపాటు ఉచిత తరగతులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సైబరాబాద్‌లో ఇన్‌స్పెక్టర్‌ల బదిలీలు

హైదరాబాద్ సిటీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో పలువురు ఇన్‌స్పెక్టర్‌లను బదిలీ చేస్తూ సీపీ అవినాష్ మహంతి ఆదేశాలు జారీ చేశారు. ఐటీకారిడార్ ఉమెన్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఎస్.భరత్‌కుమార్‌ను సూరారాం పోలీస్‌స్టేషన్‌కు, కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్ డి.కృష్ణమోహన్‌ను మాదాపూర్‌కు, మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ జి.మల్లేశ్‌ను జీడిమెట్ల ఎస్‌హెచ్‌ఓగా, ఐటీసెల్ ఇన్‌స్పెక్టర్ కొత్తపల్లి ముత్తును కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ కె.క్యాస్ట్రోను రాజేంద్రనగర్ ఎస్‌హెచ్‌ఓగా, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ పి.నరేందర్‌ను మైలార్‌దేవ్‌పల్లికి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఎం.భూపాల్ శ్రీధర్‌ను చేవెళ్ల ఎస్‌హెచ్‌ఓగా, మేడ్చల్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ కె.నరసింహను షాద్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. చేవెళ్ల ఇన్‌స్పెక్టర్ ఎం.లక్ష్మారెడ్డిని ఐటీ కారిడార్ ఉమెన్ పోలీస్‌స్టేషన్‌కు, శంకరపల్లి, మోకిల పోలీస్‌స్టేషన్‌లో డీఐగా పనిచేస్తున్న ఆందోల్ నాగరాజును అల్వాల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు, జీడిమెట్ల డీఐగా పనిచేస్తున్న విజయ్‌నాయక్‌ను మాదాపూర్ డీఐగా, మాదాపూర్ డీఐ రమేష్‌నాయుడును చేవెళ్ల డీఐగా, మేడ్చల్ ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ కొచ్చర్ల రవిని అత్తాపూర్ డీఐగా, మైలార్‌దేవ్‌పల్లి డీఐగా పనిచేస్తున్న గొల్ల తిమ్మప్పను మేడ్చల్ సీసీఎస్‌కు బదిలీ చేశారు. మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ పి.మధు, జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ పి. శ్రీనివాసరావులను సైబర్ క్రైం రాణాకు, రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ బి.నాగేంద్రబాబును స్పెషల్ బ్రాంచ్‌కు, షాద్‌నగర్ ఇన్‌స్పెక్టర్ కె.ప్రదీప్ లింగంను సీపీఓకు బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

'కాలిడోస్కోప్ 3.0'పై జాతీయస్థాయి సదస్సు



'కాలిడోస్కోప్ 3.0 సదస్సులో డాక్టర్ దిబ్యేందు ముజుందార్ రాకేష్‌మనోచా తదితరులు

అల్వాల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ అకాడమీ ఆఫ్ కన్జర్వేటివ్ డెంటిస్ట్రీ అండ్ ఎండోడొంటిక్స్(ఐఏసీడీఈ) సహకారంతో ఆర్మీ కాలేజ్ ఆఫ్ డెంటల్ సైన్సెస్, కన్జర్వేటివ్ డెంటిస్ట్రీ, ఎండోడొంటిక్స్ విభాగం ఆధ్వర్యంలో గురువారం 'కాలిడోస్కోప్ 3.0' పై జాతీయస్థాయి సదస్సును నిర్వహించారు. డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(డీసీఐ) అధ్యక్షుడు డాక్టర్ దిబ్యేందు ముజుందార్ సదస్సును ప్రారంభించారు. ఈ సదస్సుకు దేశం నలుమూలల నుంచి 150 మంది ప్రతినిధులు హాజరయ్యారు. జనరల్ ఆఫీసర్ కమాండింగ్, మేజర్ జనరల్ రాకేష్‌మనోచా, బ్రిగేడియర్ ప్రశాంత్ హాలిగేరి, ఆర్మీ కాలేజ్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మమతా కౌశిక్, డాక్టర్ దీపక్‌శర్మ, డాక్టర్ ఆర్ ఎస్ మోహన్‌కుమార్, డాక్టర్ గిరిష్ పర్మార్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలి : ఎమ్మెల్యే



ఉద్యోగ విరమణ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

పేట్‌బషీరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఫ్లైఓవర్ పనులను తొందరగా పూర్తిచేయాలని అధికారులకు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సూచించారు. జీడిమెట్ల డివిజన్‌లోని పేట్‌బషీరాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం హెచ్‌ఎండీఏ, జలమండలి, అటవీ, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షా సమావేశాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని బాచుపల్లి ఫ్లైఓవర్, బాచుపల్లి నుంచి బౌరంపేట, బహదూర్‌పల్లి నుంచి కొంపల్లి రోడ్డు విస్తరణ పనులపై సుమారు రూ.3.97 కోట్లలతో శంకుస్థాపన జరిగినా నేటికీ పూర్తి కాలేదన్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, బాచుపల్లి ఫ్లైఓవర్ పనులను తొందరగా పూర్తిచేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. బాచుపల్లి నుంచి మల్లంపేటకు రూ.1.64 కోట్లుతో, 1.20 కిలో మీటర్ల రోడ్డు విస్తరణ పనులను, మల్లంపేట నుంచి బౌరంపేట వరకు రూ.2.07 కోట్లతో సుమారు 4.80కిలో మీటర్ల రోడ్డు విస్తరణ పనులు, గండిమైసమ్మ నుంచి బహదూర్‌పల్లి వరకు చేపడుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో అడ్డంగాఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాల పనులను చేపట్టాలన్నారు. మియాపూర్ నుంచి గండిమైసమ్మ వరకు 13.3 కిలో మీటర్ల రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా 1.50కిలో మీటర్లు, కొంపల్లి, బహదూర్‌పల్లి 7కిలో మీటర్ల మార్గంలో సుమారు రూ.5.74 కోట్లతో చేపట్టనున్న రోడ్డునిర్మాణ పనుల్లో 2.8 కిలో మీటర్ల అటవీ శాఖ భూములకు అనుమతి తీసుకొని రోడ్డు విస్తరణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని అధి కారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రామకృష్ణారావు, దుండిగల్, కొంపల్లి కమిషనర్‌లు సత్యనారాయణ, శ్రీహరి, దుండిగల్, గండిమైసమ్మ ఎంఆర్‌ఓ మతిన్, హెచ్ఎండీఏ అధికారులు యూసూబ్, హుస్సేన్, అప్పారావు, హరికృష్ణ, వేణుగోపాలరావు, రమేష్‌బాబుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శ్రమే ఆయుధంగా ఈ స్థాయికి ఎదిగా : శ్రీధర్‌రెడ్డి



శ్రీధర్‌రెడ్డి దంపతులకు సన్మానం

పేట్‌బషీరాబాద్: చిన్న పల్లెటూరులో పుట్టిన తాను ఎన్నో కష్టాలను అధిగమించి, ఈస్థాయికి చేరానని జలమండలి రెవెన్యూ సీజీఎం, కుత్బుల్లాపూర్ ఇన్‌చార్జి జీఎం శ్రీధర్ రెడ్డి అన్నారు. గురువారం కుత్బుల్లాపూర్ జలమండలి రంగారెడ్డినగర్ డివిజన్‌లోని ఏపీహెచ్‌బీ కాలనీలోని కార్యాలయంలో ఆయన ఉద్యోగ విరమణ సభను జలమండలి సిబ్బంది నిర్వహించారు. ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, జలమండలి డైరెక్టర్ ఆపరేషన్-2, స్వామి, సీజీఎంలు విజయరామారావు, వినోద్‌భార్గవ్, కిరణ్‌కుమార్, నాగేంద్రకుమార్, సుబ్బారాయుడు, ఉద్యోగవిరమణ పొందిన సీజీఎంలు సీతారామ్, జీఎం వేణుగోపాల్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. శ్రీధర్ రెడ్డి దంపతులను శాలువాతో సత్కరించారు.

ఉద్యోగ విరమణ వయస్సుకే కానీ మనస్సుకు కాదు

దుండిగల్: ఉద్యోగ విరమణ వయస్సుకే కానీ, మనస్సుకు కాదని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. బహదూర్‌పల్లి పాఠశాలలో 10 సంవత్సరాల పాటు అసిస్టెంట్ కమిషనర్, గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్‌గా హరిరవీంద్రనాథ్ విద్యార్థులకు సేవలందించారని అన్నారు. బహదూర్‌పల్లి మేకల వెంకటేశం ఫంక్షన్‌హాల్‌లో హరిరవీంద్రనాథ ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. బాలికల విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. దుండిగల్ మున్సిపల్ వైస్‌చైర్మన్ తుడుం పద్మారావు, కౌన్సిలర్లు, సునతా వెంకటేశ్వర్, సత్యనారాయణ, నిజాంపేట్ కార్పొరేటర్ మేకల వెంకటేశం, నాయకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

బై బ్యాక్ స్కీము పేరుతో మోసం చేసిన ఇద్దరి అరెస్ట్

హైదరాబాద్ సిటీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ పెట్టుబడుల పేరుతో డబ్బులు వసూలు చేసి, మోసం చేసిన కేసులో ఇద్దరిని సైబరాబాద్ ఎకనమిక్ అఫెన్స్ వింగ్ అధికారులు గురువారం అరెస్ట్ చేశారు. రాజమండ్రికి చెందిన కలపతపు శ్రీలక్ష్మీ ప్రసాద్.. శుభోదయం ఇన్‌ఫ్రా (ఓపీసీ) ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో మాదాపూర్ అరుణోదయ కాలనీలో ఓ సంస్థను ప్రారంభించాడు. విజయవాడకు చెందిన మునుగలూరి వెంకటసత్యసుధీర్ అకౌంటెంట్. రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులుపెడితే అధికలాభాలు వస్తాయని నమ్మించాడు. జనగాం జిల్లా రఘునాథపల్లి మండలం కిలాస్‌పూర్‌లో వెంచర్లు చేసి విక్రయిస్తున్నామని పెట్టుబడి పేరుతో పలువురి నుంచి డబ్బు వసూలు చేశాడు. అంతేకాక పెట్టుబడి పెడితే స్థలం వస్తుందని, దీనికి బైబాక్ (తిరిగి కొనుగోలు) హామీ కూడా ఇచ్చాడు. బై బ్యాక్ స్కీములో పెట్టుబడి పెట్టి ఒక ఎకరం కొనుగోలు చేసిన వారికి 13 నెలల్లో పెట్టుబడిలో 50 శాతం, 18 నెలల్లో 75 శాతం, 26 నెలల్లో 100 శాతం లాభాలు ఇస్తానని నమ్మించాడు. ఇలా 13 మంది బాధితుల నుంచి రూ.3.16 కోట్లు వసూలు చేశాడు. డబ్బులు రాకపోయేసరికి మోసపోయామని గ్రహించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సైబరాబాద్ ఎకనమిక్ అఫెన్స్ వింగ్ అధికారులు శ్రీలక్ష్మీ ప్రసాద్, వెంకటసత్యసుధీర్‌ను అరెస్ట్ చేశారు.

రాజీవ్‌గాంధీనగర్‌లో డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి



రాజీవ్‌గాంధీనగర్‌లో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

అల్లాపూర్, 27 జూన్ (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ పరిధిలోని రాజీవ్‌గాంధీ నగర్‌లో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతిని రోడ్డుపై పొంగుతోందన్న స్థానికుల ఫిర్యాదుల మేరకు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గురువారం అక్కడ పర్యటించారు. అధికారులతో కలిసి బాధిత ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవటంతో మురుగు నీరు ఇళ్లలోకి చేరుతోందన్నారు. వీలైనంత త్వరగా డ్రైనేజీ పనులను పూర్తి చేయాలన్నారు. గత ప్రభుత్వం ఇంటింటికీ 20 వేల లీటర్ల మంచినీళ్ల ఉచితంగా అందిచగా, ప్రస్తుతం జలమండలి అధికారులు మాత్రం గతంలో వాడుకున్న నీటికి సైతం బిల్లు కట్టాలంటూ ప్రజలను వేధిస్తున్నారని పేర్కొన్నారు. ఇలా పేదలను పీడించడం సబబుకాదన్నారు. ఈ కార్యక్రమంలో లింగాల అయిలయ్య, వీరారెడ్డి, సయ్యద్ రియాజ్, ముత్యాల దుర్గ, జీహెచ్ఎంసి అధికారులు ఏఈ రంజిత్, డీఈ ఆనంద్, జలమండలి డీ.ఎం.విలియం ప్రకాష్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి

హైదర్‌నగర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ సమస్యల గురించి మేడ్చల్ జోన్ సీజీఎం సాయిబాబాతో కలిసి గురువారం ఎల్లమ్మబండ స్లమ్ ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా విద్యుత్ సమస్యలను పరిశీలించారు. విద్యుత్ వైర్లు, విద్యుత్ స్తంభాలు మార్చాలని, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేయాలని కార్పొరేటర్ సీజీఎం దృష్టికి తీసుకువచ్చారు. రోడ్డుకు అడ్డుగా ఉన్న స్తంభాలను మార్చాలని కోరారు.

సీసీరోడ్డు, భూగర్భ డ్రైనేజీ పనుల పరిశీలన

రాయదుర్గం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపన్‌పల్లిలో రూ.30లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్డును, రాజీవ్‌నగర్‌లో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలతో పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షుడు హనుమంతునాయక్, సీనియర్ నాయకులు శ్రీనివాస్, ప్రభాకర్, మురగ, రమేష్, రంగస్వామి, శ్రీకాంత్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్, మల్లేష్, గోపన్‌పల్లి, రాజీవ్‌నగర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

స్కూల్ ఆటోలపై ప్రత్యేక డ్రైవ్

- నిబంధనలు పాటించని 621 మందిపై కేసులు నమోదు



తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

హైదరాబాద్ సిటీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): స్కూలు పిల్లలను తరలిస్తున్న ఆటోలపై హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు గురువారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 7.30 గంటల నుంచి 9.30 గంటల వరకు 3.00 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్కూల్ ఆటోలను తనిఖీ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ఆటో నడుపుతున్న 11 మంది, ఎక్కువ మంది స్కూలు పిల్లలను తరలిస్తున్న 95 మందిపై, ఒక మైనర్ ఆటోడ్రైవర్‌పై, పైలెట్ డ్రైవర్‌ను కలిగిఉన్న 57 మందిపై, రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేస్తున్న 40 మందిపై, యూనిఫాం ధరించని 406 మందిపై, డాక్యుమెంట్లు లేకుండా ఆటోలను నడుపుతున్న 11 మందిపై కేసులు నమోదు చేశారు. స్కూల్ ఆటోల్లో విద్యార్థులను తరలిస్తున్న ఆటోలను తల్లిదండ్రులు, పాఠశాల నిర్వాహకులు గమనిస్తుండాలని అడిషనల్ సీపీ ట్రాఫిక్ పి.విశ్వప్రసాద్ తెలిపారు. పరిమితికి మించి విద్యార్థులను ఆటోలో తరలించకుండా చూడాలని సూచించారు.

హెచ్‌సీయూను సందర్శించిన ఇండోనేషియా కాన్సుల్ జనరల్



ఇండోనేషియా కాన్సుల్ అధికారులతో హెచ్‌సీయూ వీసీ తదితరులు

హైదరాబాద్ సిటీ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని రిపబ్లిక్ ఆఫ్ ఇండోనేషియా కాన్సుల్ జనరల్ బృందం సందర్శించింది. ముంబై కార్యాలయం నుంచి హెచ్‌సీయూకు వచ్చిన వారిలో కాన్సుల్ జనరల్ ఎడ్డీ వార్డోయో, ప్రోటోకాల్ కాన్సుల్ కె.ఐ. జింటింగ్, వీసా అధికారి ముహమ్మద్ సయప్రుద్దీన్ అఖ్యార్‌తో కలిసి ఇఫ్లూ హైదరాబాద్ పీహెచ్‌డీ స్కాలర్ ఫిల్జా పర్హానా హసిబువాన్, ఎన్ఐటీ వరంగల్ బీటెక్ విద్యార్థి ఫర్రాస్ హైదర్ రెహమాన్ తదితరులు ఉన్నారు. వీరికి హైదరాబాద్ విశ్వవిద్యాలయం తరపున ఇంటర్నేషనల్ అఫైర్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ చేతన్ శ్రీవాస్తవ స్వాగతం పలికారు. ఆపై హెచ్‌సీయూ వైస్‌చాన్సలర్ బీజే రావును కలిసి యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్- ఇండోనేషియాలోని విశ్వవిద్యాలయాల మధ్య సహకారం గురించి చర్చించారు. ఈ సందర్భంగా వర్సిటీలో ఆఫర్ చేస్తున్న కోర్సులు, పరిశోధన అవకాశాలను ఇండోనేషియా ప్రతినిధులకు హెచ్‌సీయూ వీసీ ప్రొఫెసర్ బీజే రావు పరిచయం చేశారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో అతితక్కువ ఖర్చుతో నాణ్యమైన ఉన్నతవిద్యన అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఐఓఈ డైరెక్టర్ ఎం.ఘనశ్యామ్ కృష్ణ, ఆర్అండ్‌డీ డైరెక్టర్ ఎస్ఎల్ సబాత్, ఇంటర్నేషనల్ అఫైర్స్ అసోసియేట్ డైరెక్టర్ అలోక్ కుమార్ మిశ్రా, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఆశిష్ జాకబ్ థామస్ తదితరులు పాల్గొన్నారు.

వర్షపునీరు నిలవకుండా పటిష్ఠ చర్యలు : జెడ్‌సీ



రోడ్డుపై వరద నిల్వవుండే ప్రాంతాలను పరిశీలిస్తున్న జెడ్‌సీ ఉపేందర్‌రెడ్డి, అధికారులు

గచ్చిబౌలి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం నేపథ్యంలో జోన్ వ్యాప్తంగా ఎక్కడా ముంపు సమస్యలు పునరావృతం కాకుండా పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని శేరిలింగంపల్లి జోనల్‌కమిషనర్ ఉపేందర్ రెడ్డి ఆదేశించారు. ఆయా విభాగాల అధికారులతో కలిసి గురువారం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. నెక్టార్‌గార్డెన్, త్రిషూల్‌గ్రౌండ్, బయోడైవర్సిటీ, నెక్టార్ గార్డెన్, లింగంపల్లి ఆర్‌యూబీ, బయోడైవర్సిటీ కూడలి ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వర్షాలకు నీరు నిలిచే ప్రాంతాలను, అక్కడ చేపడుతున్న బాక్స్ డ్రైన్లు సహా ఇతర నిర్మాణాలను జడ్‌సీ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ముగిసే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడ ఆటంకం కలిగినా తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వరదనీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న అక్రమ కట్టడాలను కూల్చివేయాలని ఆదేశించారు. అదేవిధంగా వరదమళ్లింపు, నిర్మాణ బాక్స్ డ్రైన్లు, ఇతర నిర్మాణ పనులను వెంటనే పూర్తిచేయాలన్నారు. ఈదురుగాలులు, ఇతర కారణాలతో రోడ్లపై పడే చెట్లను గ్రీన్‌వేస్ట్‌ను వెంటనే తొలగించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీ రజనీకాంత్‌రెడ్డి, ఎస్ఈ శంకర్, ఈఈ శ్రీనివాస్, పట్టణ ప్రణాళిక ఏసీపీ మెహ్రా, వైద్యాధికారి డాక్టర్ నగేష్‌నాయక్, డీఈ, ఏఈ ఇతర అధికారులు పాల్గొన్నారు.

మియాపూర్‌లో 8 అక్రమ నిర్మాణాల కూల్చివేత

మియాపూర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మియాపూర్‌లోని సర్వేనెంబర్ 100, 101లోఉన్న అక్రమ నిర్మాణాలను గురువారం హుడా అధికారులు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో కలిసి కూల్చివేశారు. ఖాళీ భూములను పేదలు ఆక్రమించడానికి ప్రయత్నించడంతో పోలీసులకు, పేదలకు, కబ్జారాయళ్ల మధ్య వివాదం రాజుకున్న విషయం తెలిసిందే. ఈ భూమిని కాపాడే ప్రయత్నంలో పేదలను బయటకు వెళ్లగొట్టడానికి పోలీసులు, పేదల మధ్య రణరంగంగా మారింది. అయితే ఇప్పటికే హుడా, పోలీసులు ఈ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించిన వారిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే 56మందిని అరెస్టు చేశారు. ప్రభుత్వ భూమి కబ్జా చేసి నిర్మించిన 8 నిర్మాణాలను కూల్చివేశారు. ఈ కూల్చివేతలో హుడా, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

నేడు ఏఐఐడబ్ల్యూఆర్‌పై జేఎన్‌టీయూలో వర్క్‌షాప్

హైదరాబాద్ సిటీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అప్లికేషన్స్ ఇన్ వాటర్ రిసోర్సెస్(ఏఐఐడబ్ల్యూఆర్) అంశంపై శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రామ్ కన్వీనర్ డాక్టర్ ఎంవీఎస్ గిరిధర్ తెలిపారు. వర్సిటీ సివిల్ ఇంజనీరింగ్ విభాగం సెమినార్ హాల్‌లో ఉదయం 9.30గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. సీనియర్ ప్రొఫెసర్ జీకే.విశ్వనాథ్ పదవీవిరమణ సందర్భంగా నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌కు ముఖ్యఅతిథులుగా వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్‌చాన్స్‌లర్ బుర్రావెంకటేశం, బిట్స్ పిలానీ ప్రొఫెసర్ కె.శ్రీనివాసరాజు, ఏఐ నిపుణురాలు లంకారమాదేవి, ఇతర వర్సిటీ ఉన్నతాధికారులు పాల్గొంటారని వెల్లడించారు. సివిల్, కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు, అధ్యాపకులకు ఈ వర్క్‌షాప్ ఎంతగానో దోహదపడుతుందని, ప్రవేశానికి ఎంట్రీ ఫీజు లేదన్నారు.

జేఎన్‌టీయూ క్యాంటీన్‌లో ఫుడ్‌సేఫ్టీ తనిఖీలు

హైదరాబాద్ సిటీ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ క్యాంటీన్‌పై ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీలు చేశారు. క్యాంటీన్ నిర్వహణకు అవసరమైన లైసెన్స్ లేకపోవడాన్ని గుర్తించారు. వినియోగదారులకు ఆహారాన్ని అందించే సిబ్బంది తలపాగా, గ్లౌజులు, ఆప్రాన్లు ధరించక పోవడాన్ని అధికారులు తప్పుపట్టారు. పాక్షికంగా తయారుచేసిన ఆహార పదార్థాలు, కోసిన కూరగాయలను సరిగా కవర్ చేయకుండా ఓపెన్‌గా ఉంచారని తెలిపారు. వంటగదిలో ఆహార వ్యర్థాలు నేరుగా నేలపై పడటంతో అపరిశుభ్రత నెలకొందని వెల్లడించారు. మరోవైపు గడువు ముగిసిన బియ్యం పిండిని పారబోశారు. వినియోగాదరులను అప్రమత్తం చేసేందుకని ఎక్స్‌వేదికగా ఫోటోలు, వివరాలను ఆహారభద్రతా కమిషనర్ వెల్లడించారు. ఇదిలా ఉంటే.. క్యాంటీన్ కాంట్రాక్టు గడువు ముగిసినా, అధికారులు కొత్త టెండర్లు పిలవపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారులకు పెద్దమొత్తంలో సొమ్ము ముడుతున్నందునే పాత కాంట్రాక్టరుకే క్యాంటీన్ బాధ్యతలను కొనసాగిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పార్టీకి సేవలందిస్తున్న వారికి గుర్తింపు ఇవ్వాలి

షాపూర్‌నగర్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ జనరల్‌సెక్రెటరీ గొల్ల జాన్ గురువారం న్యూఢిల్లీలో ఎన్ఎస్‌యూఐ అఖిల భారత ఇన్‌చార్జి కన్హయ్యకుమార్, జాతీయ అధ్యక్షుడు వరుణ్ చౌదరిని జాతీయ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వారితో పాటు ఆఫీస్ బేరర్‌లు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్ఎస్‌యూఐ కార్యకలాపాలు, చేయాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. ఎన్ఎస్‌యూఐలో గత 10 సంవత్సరాలుగా పార్టీకి సేవలందిస్తూ, కష్టపడి పనిచేసిన వారికి నామినేటెడ్ పోస్టులలో అవకాశం కల్పించాలని తెలంగాణ ప్రభుత్వానికి విన్నవించాలని కోరారు. రానున్న రోజుల్లో పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ఎన్ఎస్‌యూఐ ముందుండి పోరాడుతుందన్నారు.

'నీట్' లీకేజీపై ప్రధాని స్పందించాలి: ఎస్ఎఫ్ఐ

షాపూర్‌నగర్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): 'నీట్' లీకేజీపై ప్రధాని మోదీ తక్షణమే స్పందించాలని యావత్ దేశంలోని విద్యార్థులు లీకేజీతో ఆందోళన చెందుతుంటే దేశ ప్రధాని స్పందించకపోవడం విచారకరమని ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు ఎం.చంద్రకాంత్ అన్నారు. గురువారం షాపూర్‌నగర్ ప్రభుత్వ పాఠశాల వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎన్‌డీఏను రద్దుచేయాలని, దేశంలోనే ఎంతో ప్రతిష్టాత్మకమైన నీట్ లీకేజీపై మోదీ ప్రభుత్వం ఇంత వరకు స్పందించకపోవడం సిగ్గుచేటు అన్నారు. నీట్ పరీక్షను వెంటనే రద్దు చేసి తిరిగి నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు గణేష్, రవికిరణ్, పాల్గొన్నారు.

ప్రకృతిని కాపాడుకోవడానికి మొక్కలు నాటాలి

జీడిమెట్ల,జూన్27(ఆంధ్రజ్యోతి): ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి ప్రధాన లక్ష్యమని బీజేపీ జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎస్.మల్లారెడ్డి, కుత్బుల్లాపూర్ బీజేపీ కన్వీనర్ జేకె శేఖర్‌యాదవ్ అన్నారు. శ్యామాప్రసాద్‌ముఖర్జీ జన్మదిన వేడుకల్లో భాగంగా బీజేపీ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం జగద్గిరిగుట్ట శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాలయం ముందు చెట్లు నాటే కార్యాక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలుష్య నియంత్రణకు మొక్కలు నాటాల్సిన అవశ్యకత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, ప్రకాశ్‌గుప్త, విటల్, బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర జనరల్ సెక్రెటరీ అరకల సుధా, భీమయ్య, సురేష్‌రెడ్డి, సాయినేత పాల్గొన్నారు.

ఏబీవీపీ విద్యార్థి నాయకుల ఆందోళన

దుండిగల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): దుండిగల్‌లోని ఎంఎల్ఆర్ఐటీ ఫార్మా కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థినిని ప్రిన్సిపల్ వేధింపులకు గురిచేస్తున్నాడంటూ ఏబీవీపీ విద్యార్థి నాయకులు గురువారం ఉదయం 8 గంటల సమయంలో ఆందోళన చేపట్టారు. అందుకు కొంతమంది విద్యార్థినులు కూడా ఆందోళనలో పాల్గొన్నారు. చివరకు కళాశాల అధ్యాపకులు పరిస్థితిని చక్కదిద్దడంతో ఏబీవీపీ నాయకులు ఆందోళన విరమించారు.

వీడీసీసీ పనులను పరిశీలించిన కార్పొరేటర్

బాలానగర్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): బాలానగర్ డివిజన్ పరిధి ఫూల్‌బాగ్ కాలనీలో జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి గురువారం పర్యటించారు. కాలనీలో చేపట్టిన వీడీసీసీ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి సర్కిల్ డీఈ బాలకిషన్, ఏఈ మహ్మద్ రషీద్, వర్క్ ఇన్స్‌పెక్టర్ రాములు, ఫూల్‌బాగ్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సభాపతిరెడ్డి, స్థానికులు ఉన్నారు.

లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన కార్పొరేటర్

ఫతేనగర్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో ముప్పుకు గురయ్యే లోతట్టు ప్రాంతాలను ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ గురువారం పరిశీలించారు. డివిజన్ పరిధిలోని ఎల్‌బీఎస్‌నగర్‌లో వర్షంకురిసిన ప్రతిసారీ వరద నీరు బస్తీలోకి, ఇళ్లలోకి వచ్చి చేరుతోందని బస్తీవాసులు కార్పొరేటర్‌కు విన్నవించారు. దీంతో డివిజన్ ఏఈ పవన్‌ను వెంట బెట్టుకుని ఎల్‌బీఎస్‌నగర్ వెళ్లి సమస్యపై ఆరాతీశారు. అఫ్జల్, శ్రీను, సురేందర్‌నాయుడు, ఖాజా పాల్గొన్నారు.

బస్తీలలో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించండి

ఓల్డుబోయినపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో రోగాలు, విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందని అందుకే బస్తీలలో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ పారిశుధ్య/రాంకీ సిబ్బందికి సూచించారు. గురువారం ఉదయం తన నివాసంలో రాంకీ సిబ్బంతో సమావేశమై బస్తీలో ఉన్న సమస్యపై చర్చించారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి సర్కిల్ అధికారులు మమత, శానిటేషన్ సూపర్‌వైజర్ మనోహర్‌రెడ్డి, జవాన్ బుజ్జి, ఎస్ఆర్‌పీ చైతన్య, రాంకీ ప్రతినిధులు పాల్గొన్నారు.

బోనాల నిధులను మంజూరు చేయండి : రమేష్

బాలానగర్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాంప్రదాయానికి ప్రతీకగా నిలిచే అమ్మవారి ఆషాఢమాస బోనాలు జూలై 7 నుంచి మొదలవుతున్న నేపథ్యంలో బోనాల వేడుకలు నిర్వహించేందుకు నిధులు మంజూరు చేయాలని కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇంచార్జి బండి రమేష్ అన్నారు. గురువారం నగరంలోని బొగ్గులకుంట ఎండోమెంట్ కార్యాలయంలో కమిషనర్ హనుమంతరావుకు వినతిపత్రం అందజేశారు. కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలో మొత్తం 104 అమ్మవారి అలయాలకు ప్రతీ ఏడాది విడుదల చేసే నిధులు సరిపోవడం లేదని, బడ్జెట్‌ను పెంచి వెంటనే మంజూరు చేయాలని కమిషనర్‌ను కోరారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

కూకట్‌పల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీకాలనీ టెంపుల్‌బస్టాపులోని శ్రీ పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం తిరుప్పావడసేవ, మహామృత్యుంజయ యాగం, లక్ష పుష్పార్చన, గజవాహనంపై ఊరేగింపు కార్యక్రమాలను జరిపించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భారతీ కూచిపూడి డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకొంది.